# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06.12.2024 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది.
2. రాజకీయ పార్టీల నాయకులు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో పాల్గొని సమాచారాన్ని అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
3. ఈ రోజు మహాపరినిర్వాణ దివస్ సందర్భంగా రాజ్యాంగ శిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ కి దేశప్రజలు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. .
4. విధాన రేపో రేటును ఎటువంటి మార్పు లేకుండా 6.50 శాతం కొనసాగించాలని భారత రిజర్వు బ్యాంక్ నిర్ణయించింది..

…………………………………………

**అంబేద్కర్-గడ్డ ప్రసాద్**

డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ వర్ధంతి సందర్భంగా శాసనసభ ఆవరణలోని విగ్రహానికి రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, విప్ అడ్లూరి లక్ష్మణ్, పలువురు అధికారులు పాల్గొన్నారు . (HYD - PTC)

**DAY RBI-MONETARY POLICY**: విధాన రేపో రేటును ఎటువంటి మార్పు లేకుండా 6.50% కొనసాగించాలని భారత రిజర్వు బ్యాంక్ నిర్ణయించింది. ఈ ఉదయం ప్రకటించిన

మధ్యంతర ద్రవ్య విధాన రేట్లలో రిజర్వ్ బ్యాంక్ స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ ఎస్ డి ఎఫ్ రేటును 6.25% గానే కొనసాగించాలని కూడా నిర్ణయించింది. భారత రిజర్వ్ బ్యాంక్ 2023 ఫిబ్రవరి నుంచి వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పులు చేయడం లేదు. ద్రవ్యోల్బణాన్ని లక్ష్యం ప్రకారం కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది డిసెంబర్ 4 5 6 తేదీల్లో ద్రవ్య విధాన కమిటీ సమావేశం జరిగింది.

**అంబేద్కర్-సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఈ రోజు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయాల సముదాయంలో అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.

(సిరిసిల్ల, పీటీసీ)

**అరెస్టులు**

తమ పార్టీ నేతల అరెస్ట్ కు వ్యతిరేకంగా ఈ రోజు హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ పిలుపు నేపథ్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నేతలను పోలీసులు ఉదయం నుంచి గృహనిర్బంధంలో ఉంచారు. ఈ నిరసనకు అనుమతి లేదంటూ హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు మాధవరం క్రుష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇతర ప్రజా ప్రతినిధులు బయటికి రాకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు.. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని హరీశ్‌రావు ఖండించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్ళనివ్వకుండా నిర్బంధించడం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. (డెస్క్)

**ఎస్డీఆర్ఎఫ్ ప్రారంభం- సీఎం**

వరదలు, భారీ అగ్నిప్రమాదాలు, భూకంపం తదితర విపత్తులు సంభవించినప్పుడు అత్యవసరంగా రక్షణ చర్యలు చేపట్టే లక్ష్యంతో 2000 మంది సుశిక్షితులైన సిబ్బందితో కూడిన రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్)ను తెలంగాణ అగ్ని మాపకశాఖ సిద్ధం చేసింది. ప్రజాపాలన- విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో ఈ ఎస్డీఆర్ఎఫ్ ను ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ముందుగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఎస్డీఆర్ఎఫ్ వాహనాల తోపాటు బోట్లను జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ స్టాల్‌ను సందర్శిస్తారు. అలాగే ఎస్డీఆర్ఎఫ్ లోగోను కూడా ఆవిష్కరిస్తారు. (డెస్క్)

**కేటీఆర్**

ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో స్వేచ్ఛను హరిస్తున్నదని, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకుంటున్నారని చెప్పారు. సచివాలయం పక్కన ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రశ్నించారు. దళితబంధు తొలగించి అంబేద్కర్ అభయహస్తం తెస్తామన్నారని, ఇప్పటి వరకు దాని అమలు చేయలేదని విమర్శించారు. వందల మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధిస్తున్నారని విమర్శించారు.

(డెస్క్)

**నల్లగొండ-సీఎం సభ ఏర్పాట్లు**

నల్లగొండ జిల్లాలో రేపు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు అన్నీ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేపు నల్గొండ జిల్లాలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వస్తున్న నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా నార్కట్ పల్లి మండలం బ్రాహ్మణ వెళ్ళంల చేరుకొని బ్రాహ్మణ వెళ్ళం ప్రాజెక్టు పైలాన్ వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ మధ్యాహ్నం దామరచర్ల మండలం వీర్లపాలేంలో సుమారు 30వేల కోట్లతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పనులను మంత్రులు పరిశీలించిన అధికారులతో సమావేశమవుతారు. (పిటిసి, నల్లగొండ)

**సర్వే-పొన్నం ప్రభాకర్**

రాజకీయ పార్టీల నాయకులు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో పాల్గొని సమాచారాన్ని అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సర్వే నిర్వహించిందన్నారు. అయితే, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు ఇంతవరకు సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ,అధికారులు, ఉన్నత స్థాయి అధికారులు ఇప్పటికీ ఎవరైనా తమ సమాచారాన్ని ఇవ్వకపోయి ఉంటే తమ ప్రాంత సమాచార సేకరణ అధికారి, ఎన్యుమరేటర్స్ ను పిలిచి సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమగ్ర ఇంటింటి సర్వే విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సర్వే నిర్వహించినప్పుడు ప్రతిపక్ష నాయకులుగా తాము సమాచారాన్ని ఇచ్చామని గుర్తు చేశారు. కాబట్టి రాజకీయ పార్టీల నాయకులందరూ కుల సర్వే కు సహకరించాలని కోరారు. (పీఎన్)

**సిరిసిల్ల-సెస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంఘం (సెస్ ) ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు, సంస్థ ఎండీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెస్ పరిధిలోని మండల సేవాసదన్ లలో ప్రతీ సోమవారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల )

**బెల్లంపల్లి-పత్తి కొనుగోళ్లు బంద్**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి లోని జిన్నింగ్ మిల్లుల్లో నేటి మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్య దర్శి భాస్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. రేపల్లెవాడలోని మహేశ్వరి కాట్స్, శ్రీరామ జెమిని , ప్రెస్సింగ్ ఫ్యాక్టరీల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడం తో ఎల్లుండి వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు .తిరిగి 9వ తేదీన పత్తి కొనుగోళ్లు జరుగుతాయన్నారు.

(పిటిసి, మంచిర్యాల)

**ఆసిఫాబాద్-సివిల్ జడ్జి**

బాలలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల క్రీడ పాఠశాలలో సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు, వాటి సంరక్షణ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. బాల్యవివాహాల నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**అంబేద్కర్-సీఎం, కేసీఆర్ నివాళి**

రోజు మహాపరినిర్వాణ దివస్ జరుపుకుంటున్నారు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయనకు దేశ ప్రజలు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. రాజ్యాంగ శిల్పి

అయిన భారత రత్న డాక్టర్ అంబేద్కర్ ప్రవచనాలు ఒక న్యాయమైన సమ్మిళితమైన సమాజాన్ని నిర్మించేందుకు ఆయన చేసిన కృషిని సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. జాతి నిర్మాణంలో అంబేద్కర్ పాత్రను స్మరించుకుంటూ ఈరోజు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లోక్సభ స్పీకర్ ఓమ్ బిర్లా డాక్టర్ అంబేద్కర్ కు పార్లమెంట్ భవన సముదాయంలోని ప్రేరణ స్థలంలో ఈరోజు పుష్పాంజలి ఘటించారు.బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళి అర్పించారు. భారత ప్రజాస్వామ్య సౌధానికి... రాజ్యాంగంతో ప్రాణం పోసిన మహనీయుడు అంబేద్కర్ అని ముఖ్యమంత్రి కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు కూడా అంబేద్కర్ కు నివాళులర్పించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

(డెస్క్)

**మావోయిస్ట్ -బంద్**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక సమీపంలో అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్ ను నిరసిస్తూ ఈనెల 9న బంద్ కు పిలుపునిస్తున్నామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1వ తేదీన తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు విప్లవకారులకు విషమిచ్చి కిరాతకంగా చంపారని ఆరోపించారు. ఈ బూటకపు ఎన్కౌంటర్‌ను ఖండిస్తూ బంద్‌కు పిలుపునిస్తున్నామని, జగన్ విజ్ఞప్తి చేశారు. ఎన్కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా )

**జనగామ-అదనపు కలెక్టర్**

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఈరోజు జిల్లా కేంద్రంలోని ధర్మకంచ

మినీ స్టేడియంలో నిర్వహించిన యోగా-శారీరక వ్యాయామం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు.

(పిటిసి,జనగామ జిల్లా)

**సిరిసిల్ల-తమిళనాడు చీరలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నేతన్నలకు పొరుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. తమిళనాడు ప్రభుత్వం ఆ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి సందర్భంగా అం దజేసే చీరలకు వస్త్రాన్ని ఇక్కడే ఉత్పత్తి చేయిస్తుంది. 11 లక్షల మీటర్ల చీరల వస్త్ర ఉత్పత్తికి ఆర్డర్లు వచ్చాయి. దీంతో స్థానిక నేతన్నలకు చేతినిండా పని దొరుకుతోంది. సిరిసిల్లలో గతంలో తెల్లని పాలిస్టర్ వస్త్రాన్ని మాత్రమే ఉత్పత్తి చేసే నేతకార్మికులు పవర్ లుమ్స్ పై రంగురంగుల్లో బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరారు. (పిటిసి,రాజన్న సిరిసిల్ల)

**యాదాద్రి-వీధి కుక్కల దాడి**

యాదాద్రి భువనగిరి జిల్లాలోగడిచిన మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కల దాడిలో 28 మంది ప్రజలు గాయపడ్డారు. రాజాపేట మండలం గంధమల్ల గ్రామంలో 8 మందిపై, భువనగిరి మండలం వడాయిగూడెం నలుగురు చిన్నారులు సహా పలువురిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆలేరు మండలం బహదూర్పేట్ లో మరో ఆరుగురు గాయపడ్డారు.

**మేడ్చల్-హైడ్రా కూల్చి వేతలు**

మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రల్ లో ప్రభుత్వ భూమి లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని హైడ్రా కూల్చి వేసింది. సర్వే నంబర్ 32,14లో డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ను నిర్మించినట్టు ఫిర్యాదులు రావడంతో హైడ్రా అధికారులు వాటిని కూల్చివేశారు. (డెస్క్)